క్లుప్తంగా

దెబ్బతిన్న కుటుంబాలను ప్రతి ఒక్కరూ ఆదుకోవాలి


సహాయం అందజేస్తున్న దృశ్యం

టి నరసాపురం : ప్రకృతి వైపరీత్యాల వల్ల దెబ్బతిన్న కుటుంబాలను ప్రతి ఒక్కరూ ఆదుకోవాలని మాజీ ఎంపీపీ, వైఎస్సార్ సీపీ నాయకులు కొత్త ప్రకాష్ బాబు అన్నారు. బొర్రంపాలెంలో ఈదురుగాలులకు పూర్తిగా ఇల్లు ధ్వంసమైన ఇంటి యజమాని రాళ్ల దుర్గారావు కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని, నిత్యావసర సరుకులను బుధవారం ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్య్ర సమరయోధుల జీవిత చరిత్ర పఠనం


స్వాతంత్య్ర సమరయోధుల గొప్పతనాన్ని చెబుతున్న విద్యార్థిని

ద్వారకాతిరుమల: స్థానిక శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా గ్రంథాలయ అధికారిణి గుర్రం బంగారు పాప స్వాతంత్య్ర సమరయోధుల గొప్పతనాన్ని బుధవారం విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా మహాత్మ గాంధీ, నెహ్రూ, సుభాష్ చంద్రబోస్, అంబేడ్కర్, భగత్‌సింగ్ జీవిత చరిత్రలకు సంబంధించిన పుస్తకాలను విద్యార్థులతో చదివించారు. అనంతరం వారితో స్వాతంత్య్ర సమరయోధుల గొప్పతనాన్ని చెప్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకురాలు బట్టు మణి, పాఠకులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన


ఉపాధి కూలీలకు మజ్జిగ అందజేస్తున్న సర్పంచ్, ఉప సర్పంచ్‌లు

జంగారెడ్డిగూడెం రూరల్ : మండలంలోని అక్కంపేటలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను బుధవారం సర్పంచ్ పారేపల్లి నాగేంద్రబాబు, ఉప సర్పంచ్ వింజమూరి కిరణ్ కిషోర్, సెక్రటరీ బ్రహ్మయ్య పరిశీలించారు. మస్టర్లను, వీక్లీ పేమెంట్ల రిసిప్టలను పరిశీలించారు. ఉపాధి కూలీలకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ కిరణ్ కిషోర్ మాట్లాడుతూ ఉపాధి మీ పథకంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉపాధి హామీ పనుల్లో అవకతవకలకు పాల్పడవద్దని, పని ప్రదేశంలో మెడికల్ కిట్లు, టెంట్, మంచినీళ్ల అందుబాటులో ఉంచాలని ఉపాధి సిబ్బందికి సూచనలు చేశారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆస్పత్రిలో అన్నదానం


అన్నదానం చేస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం : ఎన్నో సందేశాత్మక చిత్రాలలో నటించి సూపర్ స్టార్ కృష్ణ అభిమానుల గుండెల్లో నిలిచిపోయారని మురళీకృష్ణ మహేష్ యువసేన అధ్యక్షుడు బవిరిశెట్టి మురళీకృష్ణ అన్నారు. బుధవారం స్థానిక వంద పడకల ఏరియా ఆసుపత్రిలో సూపర్‌స్టార్ కృష్ణ జయంతి వేడుకలు మురళి కృష్ణ మహేష్ యువసేన ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో ఉన్న సత్యసాయి నిత్యాన్న సేవ సంస్థ ఆధ్వర్యంలో రోగులకు అన్నదానం చేశారు. ఆసుపత్రి ఆవరణలో మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎం.రమేష్ బాబు, ఎస్.పవన్ చారి, షేక్ సుభాని, పి.రాధాకృష్ణ, ఎస్ ప్రశాంత్, ఏ సీతారామ్, డి సూరి తదితరులు పాల్గొన్నారు.

హరికృష్ణబాబుకు అభినందనలు



జంగారెడ్డిగూడెం, జంగారెడ్డిగూడెం రూరల్ : శ్రీనివాసపురం గ్రామానికి చెందిన తూంపాటి హరికృష్ణ బాబు కాగ్ (కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్)లో అసిస్టెంట్ ఆడిటర్‌గా ఉద్యోగాన్ని సాధించారు. 2022 స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ నిర్వహించిన సీజీఎ (కంబైడ్ గ్రాడ్యుయేట్ లెవెల్ ఎగ్జామ్)లో ఆల్ ఇండియా స్థాయిలో 50వ ర్యాంకును సాధించాడు. ఇటీవల పరీక్షా ఫలితాలను ఎస్ఎస్‌సీ ప్రకటించింది. దీంతో ఈయన కాగ్‌లో ఏఏఓగా ఉద్యోగాన్ని పొందారు. బీటెక్ చేసిన హరికృష్ణ ప్రస్తుతం సివిల్స్‌కు ప్రిపేర్ అవుతున్నారు. ఈ సందర్భంగా హరికృష్ణకు జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి అభినందనలు తెలిపారు. దుశ్శాలువా కప్పి సత్కరించారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ లబ్ధి

- పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు
- కొమ్ముగూడెంలో గడపగడపకు మన ప్రభుత్వం


ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

బుట్టాయగూడెం : వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నామని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. బుధవారం కొమ్ముగూడెంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలరాజు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అదేవిధంగా వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని చెప్పారు. గడచిన నాలుగేళ్ల పాలనలో ప్రజా సంక్షేమం కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో సంస్కరణలను తీసుకువచ్చారని చెప్పారు. సచివాలయం, వలంటీర్ వ్యవస్థలకు దేశంలోనే మంచిపేరు వచ్చిందని అన్నారు. ప్రజలకు ఎటువంటి సమస్య వచ్చినా సచివాలయం తలుపు తడుతున్నారని చెప్పారు. వలంటీర్‌ల ద్వారా ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందించడం జరుగుతుందని అన్నారు. రాష్ట్ర ప్రజల కోసం నిరంతరం శ్రమిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని ఆయన ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మొడియం రామతులసి, ఎంపీపీ కారం శాంతి, వైస్ ఎంపీపీ కుక్కల వరలక్ష్మి, సర్పంచ్‌లు తెల్లం వెంకాయమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆరేటి సత్యనారాయణ, సయ్యద్ బాజీ, కలగర నాని, చింతపల్లి వెంకటేశ్వరరావు, అనుపోజు మురళి, బోసు, ఎస్ఎస్‌వీ వెంకట్రావు, ఏఓ బి.సుమలత, వెలుగు ఏపీఎమ్ పద్మావతి, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీఓ అలీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మురళీకృష్ణ, ఎస్సై ఎం.జయబాబు, సచివాలయ సిబ్బంది, వలంటీర్‌లు, తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌అండ్‌డీ పేటలో దుర్గమ్మ విగ్రహ ప్రతిష్ఠ


దుర్గమ్మ తల్లిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

పోలవరం రూరల్ : పోలవరం మండలం ఎల్‌అండ్‌డీపేట గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో దుర్గమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అర్చక స్వాములు ఎమ్మెల్యేను ఆశీర్వదించారు. అనంతరం నిర్వహించిన భారీ అన్నసమారాధనలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో ఎంపీపీ సుంకర వెంకట రెడ్డి, సీఐ కె.వి జయ్‌బాబు, వైఎస్సార్ సీపీ నాయకులు మార్గాని పోసిబాబు, ఇళ్ల కల్యాణ్, దూళి బాపిరాజు, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం


రామాలయంలో విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఎలీజా

లింగపాలెం : ముడిచెర్ల గ్రామంలోని రామానుజపురం కాలనీలో నూతనంగా నిర్మించిన ఆలయంలో శ్రీకోదండ సీతారామ లక్ష్మణ భరత ఆంజనేయ స్వామి విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవాలు బుధవారం వైభవంగా నిర్వహించారు. వేద మంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాల నడుమ ఉదయం 8.15 నిమిషాలకు స్వామివార్ల విగ్రహ ప్రతిష్ఠ చేశారు. అనంతరం కుంభకళావాహన, ప్రధమార్చన, గోదర్శనం, మహాపూర్ణాహుతి పూజలు నిర్వహించారు. ఉత్సవంలో భాగంగా గత రెండు రోజులుగా ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం రూ.10 లక్షల ఆర్థిక సహాయం అందించగా సమర సత సేవా ఫౌండేషన్, మరికొందరు దాతల సహకారంతో ఈ నూతన ఆలయాన్ని నిర్మించారు. చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా, విగ్రహ దాత, వైఎస్సార్ సీపీ నేత బీవీఎస్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకష్ణ, మాజీ ఏఎంసీ చైర్మన్ మందలపు సాయిబాబు, మండల వైఎస్సార్ సీపీ ముఖ్యనేత ముసునూరి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ మట్టా సురేష్, ధర్మాజీగూడెం సొసైటీ చైర్‌పర్సన్ ఉప్పలపాటి వరప్రసాద్, మండల సచివాలయ కన్వీనర్ అన్నపనేని శాంతరావు, పార్టీ నాయకులు ఎం.లోక్‌నాథ్‌రెడ్డి, బి.ప్రభాకరెడ్డి, బి.ప్రసాద్‌రెడ్డి, మందలపు నరసింహరావు, కె.ఆనంద్, సీహెచ్ సత్యన్నారాయణరెడ్డి తదితరులు స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా, విగ్రహ దాత బీవీఎస్ రెడ్డిలను ఆలయ కమిటీ సభ్యులు, సర్పంచ్ రావి కొండయ్య రమాదేవి దంపతులు ఘనంగా సన్మానించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కమిటీ ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు.

నేడు వైఎస్సార్ రైతు భరోసా విడుదల

- పోలవరం నియోజకవర్గంలో 40,168 మంది రైతులకు లబ్ధి
- రైతుల ఖాతాల్లోకి రూ. 21 కోట్ల 51 లక్షల 10 వేల 500 జమ

కొయ్యలగూడెం : రైతే రాజ్యంగా కొనసాగుతున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మరో మైలురాయిని ప్రభుత్వం అందుకుంది. రైతు భరోసా అమలు కార్యక్రమం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహిస్తున్నారు. ఉదయం 9 గంటలకు జంగారెడ్డిగూడెం రోడ్డులోని అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ ప్రాంగణంలో నిర్వహిస్తున్న సదస్సుకు ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే తెల్లం బాలరాజు హాజరు కానున్నారు. పోలవరం నియోజకవర్గంలోని ఏడు మండలాలకు చెందిన 40,168 రైతుల అకౌంట్లో రూ.21 కోట్ల 51 లక్షల 10 వేల 500 వారి ఖాతాల్లో జమ చేయనున్నారు. కొయ్యలగూడెంలో 9,505 మంది రైతులకు రూ.5 కోట్ల 22 లక్షల 77 వేల 500 జమకానుంది. అదేవిధంగా పోలవరం మండలంలో 5602 మంది రైతులకు రూ.3 కోట్ల 2లక్షల 94 వేలు, బుట్టాయిగూడెం మండలంలో 7,819 మంది రైతులకు రూ.4 కోట్ల 12 లక్షల 61 వేలు, టీ నర్సాపురం మండలంలో 9,880 మంది రైతులకు రూ.5 కోట్ల 41 లక్ష 3 వేల 500, జీలుగుమిల్లి మండలంలో 3,473 మంది రైతులకు రూ.కోటి 83 లక్షల 81 వేలు జమ కానున్నాయి. కుకునూరు మండలంలో 2,525 మంది రైతులకు రూ. కోటి 44 లక్షల 26 వేల 500, వేలేరుపాడు మండలంలో 1,168 మంది రైతులకు రూ. 43 లక్షల 67 వేలు రైతుల ఖాతాల్లో జమ చేయనున్నారు.

వ్యవసాయాన్ని పండగ చేశారు



వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలన ఐదో సంవత్సరంలోకి అడుగిడుతున్న నేపథ్యంలో రైతు భరోసా అమలు చేస్తున్నాం. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న సంక్షేమ పథకాలలో వైఎస్సార్ రైతు భరోసా ఒకటి. వ్యవసాయం దండగ అన్న దుండగుల మాటల నుంచి వ్యవసాయాన్ని జగనన్న పండగ చేశారు.

–పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

గిరిజన రైతులకూ రైతు భరోసా



పోలవరం నియోజకవర్గంలోని ఏడు మండలాలలో భూహక్కుదారులైన రైతులతో పాటు, పోడు జీవనం సాగిస్తున్న గిరిజన రైతులకు సైతం రైతు భరోసా పథకాన్ని వర్తింప చేస్తున్నాం. 40168 మంది రైతులకు రూ. 21 కోట్ల, 51 లక్షల 10 వేల 500 2023 సంవత్సరానికి సంబంధించి మొదటి విడతగా జమ చేయనున్నాం.

– పీజీ బుజ్జిబాబు, ఏడీఏ

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం


ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కామవరపుకోట : బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని కామవరపుకోట ఏరియా అంగన్‌వాడీ సూపర్‌వైజర్ బీవీఎల్ మంగాదేవి అన్నారు. బుధవారం మండలంలో రావికంపాడు, ఉప్పలపాడు, కొండగూడెం గ్రామాల్లో గ్రామస్తులకు బాల్య వివాహాలపై అవగాహన కల్పించి, ర్యాలీ నిర్వహించారు. సూపర్‌వైజర్ మంగాదేవి మాట్లాడుతూ కుటుంబ సభ్యులు ఆడపిల్లలకు వారి శరీర దృఢత్వానికి పౌష్టికాహారం అందిస్తూ, మంచి విద్యావంతులుగా ఎదిగేలా వారిని ప్రోత్సహించాలన్నారు. బాల్యంలో వివాహాలు చేయటం వల్ల వారికి పుట్టబోయే పిల్లలు బలహీనంగా జన్మించి ఎదుగుదల ఉండదన్నారు. ఎవరైనా గ్రామాల్లో బాల్య వివాహాలు చేపడితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ రైతులు ఆర్థికంగా ఎదగాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ప్రకృతి వ్యవసాయం చేస్తున్న షెడ్యూల్డు కులాలకు చెందిన రైతులు ఆర్థికంగా ఎదగడానికి, వ్యవసాయ రంగంలో పారిశ్రామిక వేత్తలుగా మారడానికి అగ్రి ఎంటర్ ప్రేన్యూర్‌షిప్ డవలప్‌మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు సీడాప్ ఈడీ జీ. పార్థసారథి తెలిపారు. పీఎం అజయ్ 2021–22 ఏపీ ఎస్సీ కార్పొరేషన్, ఏఎస్‌సీఏ, సీడాప్ ద్వారా ఏలూరు జిల్లాలో ఉన్న వైటీసీ కేంద్రంలో మే 29న ఏర్పాటు చేసిన 10 రోజుల శిక్షణ తరగతులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు జిల్లా నుంచి ఆర్‌వైఎస్ఎస్ ద్వారా ఎంపిక చేసిన రైతులకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.

పౌరహక్కులు ప్రజాస్వామ్యానికి పట్టుకొమ్మలు

ఏలూరు రూరల్: పౌరహక్కులు ప్రజాస్వామ్య వ్యవస్థకు పట్టుకొమ్మలు, వాటిని కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని ఏలూరు తహసీల్దార్ బి సోమశేఖర్ అన్నారు. మంగళవారం ఏలూరు తూర్పువీధి గంగానమ్మ ప్రాథమికోన్నత పాఠశాలలో సివిల్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడు తన హక్కులను పూర్తిగా అవగతం చేసుకుంటే ప్రజాస్వామ్యం మరింత బలోపేతం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మోనటరింగ్ కమిటీ సభ్యులు మేతర అజయ్‌బాబు, ప్రవల్లిక, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బాషా, ఎఎస్‌డబ్ల్యు త్రిమూర్తి, మెప్మా ఆర్పీ రమణతో పాటు రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యసేవల నిమిత్తం ఆర్థిక సహాయం

కామవరపుకోట : కష్టంలో ఉన్నవారికి సోషల్ మీడియా ద్వారా దాతల నుంచి ఆర్థిక సహాయం అందజేయటం చాలా ఆదర్శనీయమని కామవరపుకోట సర్పంచ్ కర్రిపోతు అనూష భాగ్యరాజ్ అన్నారు. ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ విజయవాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న యోహాను అనే వ్యక్తి వైద్య చికిత్స నిమిత్తం సోషల్ వర్కర్స్ టీం ద్వారా రూ.12,800 నగదును సర్పంచ్ అనూష ద్వారా బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా అనూష మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి సోషల్ మీడియాలో దాతలను చైతన్య పరుస్తూ వారి కష్టాన్ని తీరుస్తున్న సోషల్ వర్కర్స్ టీం సభ్యుల సేవలు అభినందనీయమని అన్నారు. కష్టంలో ఉన్న యోహానుకు దాతలు ముందుకు వచ్చి సహకరించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో సోషల్ వర్కర్స్ టీం సభ్యులు వీరమల్ల మధు, మున్నంగి శ్రీనివాస్, నిజాపరపు దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

బేటీ బచావో బేటీ పడావో ర్యాలీ


అరుంధతీ కాలనీలో ర్యాలీ చేస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం : స్థానిక అరుంధతీ కాలనీ అంగన్‌వాడీ సెంటర్‌లో బుధవారం బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ కె. ఝాన్సీరాణి మాట్లాడుతూ బాలుర జనానాలతో సమానంగా బాలికల జననాలను పెంచుతూ ఆడపిల్లల మనుగడను కాపాడాల్సిన అవసరం ఉందని అన్నారు. బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరమని అన్నారు. ఆడపిల్లలకు 18 ఏళ్లు, మగపిల్లలకు 21 ఏళ్లు నిండే వరకూ వివాహాలు చేయరాదని చెప్పారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జీఎమ్ఎస్‌కె ఏ పోసిరత్నం, ఏఎన్ఎం టి.వెంకటలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు, కిశోర బాలికలు, తల్లులు, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ మున్సిపల్ కార్యాలయంగా నామకరణం


సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు


సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి

- కౌన్సిల్ సమావేశంలో తీర్మానం
- పలు అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం

జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం మున్సిపల్ కార్యాలయం భవనానికి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి మున్సిపల్ భవనంగా నామకరణం చేయాలని మున్సిపల్ సమావేశం తీర్మానించింది. బుధవారం చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ మేరకు తీర్మానించారు. అయితే టీడీపీ సభ్యులు కె.రమాదేవి, రామచంద్రరాజు మాట్లాడుతూ గతంలో ఈ భవనానికి ఎన్‌టీఆర్ భవనంగా నామకరణం చేశామని చెప్పుకొచ్చారు. దీంతో వైస్ చైర్మన్ ముప్పిడి అంజి, కౌన్సిలర్ పీఎస్ చంద్రరావు తదితరులు మాట్లాడుతూ గత పాలకవర్గం ఎటువంటి తీర్మానం చేయలేదని, నామమాత్రంగా మాత్రమే పేరు పెట్టారని పేర్కొన్నారు. ఎక్కడైనా తీర్మానం చేసి ఉంటే దాన్ని రుజువు చేస్తే తమకు అభ్యంతరం లేదన్నారు. అందువల్ల ప్రస్తుతం పాలకవర్గం డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి పురపాలక సంఘం కార్యాలయంగా నామకరణం చేస్తూ తీర్మానం చేస్తున్నట్లు ప్రకటించారు. ఇదిలా ఉండగా సాధారణ సమావేశంలో పలు తీర్మానాలు చేశారు.

- 2, 7, 9, 11, 16, 17, 19, 20, 24, 26, 27, 28 వార్డుల్లో రూ.కోటి 51 లక్షల 60 వేలతో సీసీ రోడ్లు వేసేందుకు సమావేశం తీర్మానించింది. ఇందుకోసం సాధారణ నిధుల నుంచి ఖర్చులు చేయనున్నారు.
- 6, 15, 20, 23, 24 వార్డుల్లో సీసీ డ్రైయిన్లు నిర్మాణానికి రూ..50.80 లక్షలు వెచ్చించాలని సమావేశం తీర్మానించింది.
- 4వ వార్డులో కల్వర్టు నిర్మాణానికి రూ. 3 లక్షలు కేటాయించనున్నారు.
- 3, 9 వార్డుల్లో మంచినీటి పైపులైన్ల విస్తరణకు రూ.8.50 లక్షలు కేటాయిస్తూ సమావేశం తీర్మానించింది.
- బుట్టాయగూడెం-శ్రీనివాసపురం రోడ్లను ఆర్‌అండ్‌బీ శాఖకు బదిలీ చేస్తూ తీర్మానం
- పట్టణంలో సీసీ రోడ్లు, డ్రైయిన్లు, పైపులైన్ల విస్తరణ, వివిధ అభివృద్ధి పనులకు టెండర్లు ఖరారు చేస్తూ సమావేశం తీర్మానించింది.
- పట్టణంలో ఎల్3 జగనన్న లేఅవుట్ల కాలనీలో కొత్త బోరు నిర్మాణానికి రూ. 8 లక్షలతో సమావేశం ఆమోదం తెలిపింది. సమావేశంలో కౌన్సిలర్లు, కమిషనర్ భవాని ప్రసాద్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఖరీఫ్ సీజన్‌కు సమాయత్తం

- వర్షాల రాక కోసం ఎదురుచూపులు
- వ్యవసాయ పనులకు సిద్ధమవుతున్న రైతన్నలు


చింతలపూడి మండలంలో ఖరీఫ్ నారుమళ్లు పోసుకోవడానికి దుక్కులు దున్నుకుంటున్న రైతు

చింతలపూడి : ఖరీఫ్ సీజన్ సమీపిస్తుండటంతో మెట్ట ప్రాంత రైతులు వ్యవసాయ పనులకు సమాయత్తమవుతున్నారు. ఖరీఫ్ సాగుకు దుక్కులు దున్ని సిద్ధం చేసుకుంటున్న రైతులు వర్షాలకోసం ఆకాశం వైపు ఆశగా ఎదురు చూస్తున్నారు. గత నాలుగైదు రోజులుగా అడపా దడపా చినుకులు పడుతుండటంతో వర్షాలు ముందుగానే పడే అవకాశం ఉందని భావిస్తున్నారు. దీంతో రైతులు పొలాల్లో ఎరువులు తోలుకుని, దుక్కులు దున్నుకుని, నారుమళ్లు పోసుకోవడానికి సంసిద్ధులవుతున్నారు. తొలకరి వర్షాలు కురిస్తే వెంటనే విత్తనాలు విత్తుకోవడానికి సిద్ధంగా ఉన్నారు. ప్రతి ఏటా మే నెల చివర్లో దుక్కులు దున్నుకుని జూన్ 15 నాటికి నారుమళ్లు పోసి జూలై 15 నాటికి నాట్లు వేయడం పూర్తి చేస్తారు. చింతలపూడి సబ్ డివిజన్‌లో 450 మైనర్ ఇరిగేషన్ చెరువులు ఉన్నాయి. ఏటా సుమారు 17,000 హెక్టార్లలో రైతులు వరి పంటను సాగు చేస్తారు. ఈ ఏడాది ముందుగానే తొలకరి వర్షాలు పలకరిస్తాయని వాతావరణ శాఖ ప్రకటనలతో వర్షాలు కురుస్తాయన్న ధీమాతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. వ్యవసాయ శాఖ రైతులకు సకాలంలో అందించేలా ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలని రైతులు కోరుతున్నారు.

అందుబాటులో విత్తనాలు



ఖరీఫ్‌లో రైతులకు అవసరమైన విత్తనాలు వ్యవసాయశాఖ సిద్ధం చేస్తోంది. రుతుపవనాల ప్రభావంతో మెట్ట ప్రాంతంలో వర్షాలు ప్రారంభం అయ్యే నాటికి విత్తనాలు రైతులకు అందచేస్తాం.

బి నాగకుమార్, సహాయ సంచాలకులు, వ్యవసాయ శాఖ

జంగారెడ్డిగూడెంలో విజిలెన్స్ దాడులు


శ్రీదేవి ఆగ్రో ఏజెన్సీలో విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం : పట్టణంలో శ్రీదేవి ఆగ్రో ఏజెన్సీ విత్తనాల షాపులో బుధవారం విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. పుస్తకాల్లోని నిల్వలకు, గోడౌన్‌లోని నిల్వలకు తేడాను అధికారులు గుర్తించారు. షాపుల్లో రికార్డులను, గోడౌన్‌లోని స్టాకును తనిఖీలు చేశారు. కాయగూరలు, అపరాల విత్తనాల్లో 3.71 క్వింటాళ్ల విత్తనాల తేడాను గుర్తించారు. వీటివిలువ రూ.1.18 లక్షలు ఉంటుందని అధికారులు వెల్లడించారు. తేడా ఉన్న స్టాకును సీజ్ చేసి 6(ఎ) కేసు నమోదు చేసినట్లు విజిలెన్స్ డీఎస్పీ ఎస్. వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ దాడుల్లో విజిలెన్స్ అధికారులు టీ శ్రీనివాసన్, టీ శ్రీనివాసరావు, పీ సురేష్, నాగరాజు, శ్రీధర్, సీహెచ్ రంజిత్ కుమార్, గంగాధర్ పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థలకు నిత్యావసర సరుకుల అందజేత

జంగారెడ్డిగూడెం : సినీ నటుడు కృష్ణ జయంతిని పురస్కరించుకుని జంగారెడ్డిగూడెం కేఎంజీ (కృష్ణ, మహేష్, గౌతమ్ యువసేన)అసోసియేషన్ బుట్టాయిగూడెం రోడ్డులో ఉన్న సీతామహాలక్ష్మీ స్వచ్ఛంద సేవా సంస్థ, అమ్మ ప్రేమ స్వచ్ఛంద సంస్థలకు భోజనాలు, కొన్ని రోజులకు సరిపడా నిత్యావసర సరుకులను అందజేశారు. కృష్ణ సీనియర్ అభిమానులు పీపీఎస్ చంద్రరావు, కేఎంజీ ఫ్యాన్స్ అసోసియేషన్ సభ్యులు రాపోలు భావనాబుషి, ఉగ్గం ప్రసాద్, ఆండ్రోతు సురేష్, ఫిరోజ్, పాల్ తదితరులు పాల్గొన్నారు.